


మనం

హైదరాబాద్

రంగారెడ్డి | మేడ్చల్

గురువారం | 15 | అక్టోబర్ | 2026 పేజీలు: 11


# అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదు..

అర్హతే ప్రామాణికం

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 14: ( మనం జిల్లా ప్రతినిధి): అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదని ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదని అర్హతే ప్రామాణికం అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

2

బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్కు రంగారెడ్డి జిల్లా ఇన్ఛార్జి రాష్ట్ర పరిశ్రమలు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.







## పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ టవర్స్!

పోచారంలో నాలుగు టవర్ల నిర్మాణానికి భూమిపూజ

నివసిస్తున్న నియోజకవర్గంలోనే ఇళ్లు అందిస్తాం...మంత్రి పొంగులేటి

పేదలపై ఆర్థిక భారం పడకుండా చూడాలి...ఎమ్మెల్యే మల్లారెడ్డి

డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి...

ఎంపీ ఈటల రాజేందర్

3

## నల్లగుట్ట సుభాష్ మైదాన్ పార్కును అభివృద్ధి చేస్తాం: తలసాని

3



ఉప్పల్ మినీ స్టేడియంలో ఎంఎంసీ ఆధ్వర్యంలో

## బతుకమ్మ సంబరాలు

మహిళా ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక వేడుకలు..

ఆటపాటలతో సందడి చేసిన పోలీస్ కమిషనర్ సుమతి, మహిళా అధికారులు



సికింద్రాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ మినీ స్టేడియంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

2



# అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు

**ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదు..**

**అర్హతే ప్రామాణికం**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

మేడ్చల్, అక్టోబర్ 14: ( మనం జిల్లా ప్రతినిధి): అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదని ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదని అర్హతే ప్రామాణికం అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్కు రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి రాష్ట్ర పరిశ్రమలు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నగరంలో జీవనోపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించి వారి ఉపాధికి ఇబ్బందులు కలిగించే విధానానికి స్వస్తి పలుకుతున్నామని తెలిపారు.






క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండవ విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటామన్నారు.

ఇందిరమ్మ టవర్స్లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి అపార్ట్మెంట్కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్లో పొందుపరుస్తామని తెలిపారు.

వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారి చేతుల మీదుగా తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి, సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఉన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు 440 కోట్ల రూపాయిలు ఖర్చు చేశామని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం మంత్రుల చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను మంత్రుల చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేసారు.

కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్దిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మోతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్లో ఫ్లాట్ల కేటాయింపులు జరిగాయి.







# ఉప్పల్ మినీ స్టేడియంలో ఎంఎంసీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**మహిళా ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక వేడుకలు..**

**ఆటపాటలతో సందడి చేసిన పోలీస్ కమిషనర్ సుమతి, మహిళా అధికారులు..**



సికింద్రాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ మినీ స్టేడియంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో నిత్యం నిమగ్నమయ్యే మహిళా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆనందంగా నృత్యాలు చేశారు. స్టేడియం పూల అందాలతో కళకళలాడగా, మహిళల ఆటపాటలతో పండుగ సందడి నెలకొంది. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, మహిళా డిప్యూటీ కమిషనర్లు తదితరులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ప్రజలకు అవసరమైన సేవల్లో మహిళా సిబ్బంది నిమగ్నమై ఉండటంతో, వారు కూడా పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లకు సూచనలు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, కార్మికుల సంక్షేమంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ నిర్వహించిన ఈ వేడుకలు మహిళల్లో ఐక్యతను, సంతోషాన్ని నింపాయి. విధి నిర్వహణతో పాటు తమ సంస్కృతిని ఘనంగా జరుపుకునే అవకాశం కల్పించినందుకు పాల్గొన్న మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.







# పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ టవర్స్!

**పోచారంలో నాలుగు టవర్ల నిర్మాణానికి భూమిపూజ**

**480 మంది లబ్ధిదారులకు ఆన్లైన్ డ్రా ద్వారా ఫ్లాట్ల కేటాయింపు**

**నివసిస్తున్న నియోజకవర్గంలోనే ఇళ్లు అందిస్తాం...మంత్రి పొంగులేటి**

**పేదలపై ఆర్థిక భారం పడకుండా చూడాలి...ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి...ఎంపీ ఈటల రాజేందర్**





ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 14: పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టింది. మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన 480 మంది లబ్ధిదారుల కోసం నిర్మించనున్న నాలుగు టవర్లకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు భూమిపూజ చేశారు. అనంతరం ఆన్లైన్ లాటరీ ద్వారా లబ్ధిదారులకు ఫ్లాట్లు కేటాయించి, కేటాయింపు పత్రాలను అందజేశారు.

## పేదలకు సొంతింటి భరోసా

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి మాట్లాడుతూ.. పేదలందరికీ సొంతింటి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 23 నియోజకవర్గాల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. గతంలో పేదలకు దూర ప్రాంతాల్లో ఇళ్లు కేటాయించడంతో ఉపాధి, రవాణా సమస్యలు ఎదురయ్యాయని, ఇకపై నివసిస్తున్న నియోజకవర్గ పరిధిలోనే ఇళ్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

## లబ్ధిదారులపై భారం పడొద్దు

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే లబ్ధిదారులు రూ.10 వేలు, అనంతరం రూ.లక్ష చెల్లించారని, మిగిలిన మొత్తం చెల్లించడం వారికి భారంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం బ్యాంకు రుణ సదుపాయం కల్పించి పేదలు అప్పులపాలు కాకుండా చూడాలని కోరారు.

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పేదలకు స్థానికంగానే ఇళ్లు కేటాయించడం హర్షణీయమన్నారు. అయితే కుటుంబ అవసరాలకు సింగిల్ బెడ్రూమ్ ఇళ్లు సరిపోవని, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపును పరిశీలించాలని కోరారు.

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్బాబు మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్రెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు...

# నల్లగుట్ట సుభాష్ మైదాన్ పార్కును అభివృద్ధి చేస్తాం: తలసాని



**రూ.25 లక్షలతో లైబ్రరీ భవన నిర్మాణ పనులు ప్రారంభం..**

**పార్కు లో పచ్చదనం, వాకింగ్ ట్రాక్ల ఏర్పాటుకు అధికారులకు ఆదేశాలు..**

సికింద్రాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) నల్లగుట్టలోని సుభాష్ మైదాన్ పార్కును వీలైనంత త్వరగా అభివృద్ధి చేసి కాలనీ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్ట జే లైన్లో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న లైబ్రరీ భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. నల్లగుట్ట పరిసర ప్రాంతాల ప్రజలకు అవసరమైన సౌకర్యాలతో కూడిన లైబ్రరీని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అనంతరం స్థానికుల విజ్ఞప్తి మేరకు సుభాష్ మైదాన్ పార్కును అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. పార్కు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిన విషయాన్ని గుర్తించి, వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పచ్చదనాన్ని అభివృద్ధి చేయడంతోపాటు, కాలనీ ప్రజలు వాకింగ్ చేసేందుకు వీలుగా ట్రాక్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా, కాలనీలోకి వచ్చే మార్గంలో ఉన్న జ్యూస్ షాపు తెల్లవారుజాము వరకు తెరిచి ఉంచడం వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన తలసాని రాంగోపాల్ పేట సీఐతో ఫోన్లో మాట్లాడి, కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తమ సమస్యలపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ చంద్రశేఖర్, వాటర్ వర్క్స్ డీజీఎం వెంకట్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ శివ రామకృష్ణ, నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కిషోర్, కోటేశ్వర్ గౌడ్, గణేష్, జనార్దన్, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులు సత్యనారాయణ, మిట్టు, నరేష్, సురేష్, గంగరాజు, ఖదీర్ తదితరులు హాజరయ్యారు.



# షాబాద్లో కంది సాగుపై శిక్షణ, క్షేత్ర సందర్శన

**ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం**

**యాసంగిలో వరి సాగు వద్దు, స్వల్పకాలిక పంటలే మేలు : మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర**



షాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్): మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్ (ఎంఏఎస్పీ) 2026-27 పథకం కింద షాబాద్ మండల కేంద్రంలో కందుల పంట బ్లాక్ డెమాన్స్ట్రేషన్లపై శిక్షణ కార్యక్రమం, క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో ఈ యాసంగి (రబీ) సీజన్లో వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలు మరింత అడుగంటే అవకాశం ఉందని, అందువల్ల రైతులు వరి సాగుకు దూరంగా ఉండి తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే పంటలను ఎంచుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమయ్యే అవకాశం ఉందని, దీనివల్ల ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గి, తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. వానాకాలంలో సరైన వర్షాలు లేనందున వరి, పత్తి విస్తీర్ణం తగ్గిందని, ముందుగానే రైతులను సంసిద్ధులను చేయడంతో మండలంలో పప్పుధాన్యాల విస్తీర్ణం పెరిగిందని వివరించారు. యాసంగిలో పరిస్థితి మరింత తీవ్రమై భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉన్నందున, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయవద్దని, దానికి బదులుగా పప్పుధాన్యాలు,నూనెగింజలు, కూరగాయల పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. అలాగే మండలంలో సబ్సిడీపై శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



అనంతరం కంది పంటల ప్రదర్శన క్షేత్రాలను సందర్శించి పంట ఎదుగుదల,పరిస్థితి, రైతులు అనుసరిస్తున్న శాస్త్రీయ సాగు పద్ధతులను పరిశీలించారు.రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పంట నిర్వహణ పద్ధతులు, కందుల ఉత్పాదకత పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. బ్లాక్ డెమాన్స్ట్రేషన్ల పురోగతిని సమీక్షిస్తూ,మెరుగైన సాంకేతిక పద్ధతులను రైతులు స్వీకరించి కందుల ఉత్పత్తిని పెంచి, కంది పంటలో ఆత్మనిర్భరత సాధించే లక్ష్యానికి సహకరించాలని వ్యవసాయ అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శివతేజ, రైతులు దొంద్ర ఆంజనేయులు,దొంద్ర నర్సింహులు, సూర్యప్రకాష్ రెడ్డి, శివ, కుమార్, మల్లేష్, ముద్దెం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడు ఇల్లీగల్... ఇప్పుడు లీగల్

**ఎల్లంపేట మున్సిపాలిటీ తీరే డిఫరెంట్**
**ఎవరికి అర్థం కాని ఎల్లంపేట టౌన్ ప్లానింగ్ అధికారులు**
**రాజ బొల్లారం తండాలో నిర్మించిన రూములు ఇల్లీగల్...**
**ఇప్పుడు లీగల్ ఎలా అయ్యాయో అర్థం కాని దుస్థితి**






మేడ్చల్, అక్టోబర్ 14: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ జిల్లా ఎల్లంపేట రూటే సపరేటు. ఇక టౌన్ ప్లానింగ్ అధికారులు ఎవరికి అర్థం కారు. గతంలో రాజ బొల్లారం తండాలో కార్మికుల కోసం నిర్మించిన రూములు ఇల్లీగల్ అంటూ ఆ రూములకు అనుమతి ఇవ్వలేదు. ఇప్పుడు తాజాగా రావల్ కోల్ లో అదే కార్మికుల కోసం రూములను నిర్మిస్తే వాటికి దర్జాగా అనుమతులు ఇస్తూ లీగల్ చేశారు. రాజబొల్లారా తండాలో కార్మికుల కోసం దాదాపు 10 రూమ్ ల వరకు నిర్మించారు. అప్పుడు దానిని అడ్డుకున్న కమిషనర్ ఇప్పుడు రావల్ కోల్ లో దాదాపు 15 రూములను నిర్మించారు. అప్పుడు ఇల్లీగల్ అని ఆపిన అధికారులు ఇప్పుడు ఈ కట్టడాలకు అనుమతులు ఇస్తూ లీగల్ చేశారు. ఏంటో టౌన్ ప్లానింగ్ అధికారుల ఆలోచనలు.

## అక్రమ గోదాం ను కూల్చమంటే సీజ్ చేశారు.

ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపేటలో అక్రమంగా నిర్మిస్తున్న అరుణ గోదాం ను కూల్చి వెయ్యాలి అంటూ కోర్టు ఆదేశించినప్పటికీ ఇక్కడ మాత్రం సీజ్ చేసి చేతులు దులుపుకున్నారు. అది పేరుకు మాత్రమే సీజ్ వారం రోజులు గడిచిందో లేదో మళ్లీ ఓపెన్... కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ మేం మొనార్కులం అంటూ ఎల్లంపేట మున్సిపల్ అధికారులు మరోసారి నిరూపించుకున్నారు. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారడం వల్ల సీజ్ చేసిన వారం రోజులకే అరుణ గోదాం మళ్లీ ఓపెన్ అయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## సమగ్ర విచారణ జరిపించాలి

ఎల్లంపేటలో జరుగుతున్న వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామపంచాయతీ నుండి ఎల్లంపేట మున్సిపాలిటీగా పదోన్నతి పొందుతే అభివృద్ధి జరుగుతుందని ఆశించిన ప్రజలకు నిరాశ మిగులుతుంది. మున్సిపాలిటీలో విలీనమైన అభివృద్ధి మాత్రం శూన్యమని ఎల్లంపేట ప్రజలు పేర్కొంటున్నారు. ఇక్కడ పూర్తిస్థాయి సిబ్బందిని నియమించక పోవడం... ముఖ్యంగా ఎల్లంపేట మున్సిపాలిటీకి శాశ్వత టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో పట్టణ అభివృద్ధి కుంటుపడుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారి వారానికి రెండు రోజులు మాత్రమే ఇక్కడికి వచ్చి పోతున్నడంవల్ల టౌన్ అభివృద్ధిపై దృష్టి పెట్టలేకపోతున్నారని, అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్న వాటిని అరికట్టే వారే లేక ఇక్కడ జోరుగా అక్రమ నిర్మాణాలు అవుతున్నాయి. గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా పదోన్నతి కల్పించి చేతులు దులుపుకోవడం సరైన విధానం కాదని, మున్సిపాలిటీగా పదోన్నతి కల్పించి విధులు కానీ సిబ్బంది ని కానీ నియమించకపోవడం అన్యాయమని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీల పైన ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

---

### సేవలో తండ్రికి తగ్గ తనయుడు..

# ఆపదలో నేనున్నానంటూ ముందడుగు

**రామన్నగారి మణికంఠ గౌడ్ సేవా స్ఫూర్తి..**
**భక్తితో పాటు మానవత్వానికి పెద్దపీట**
**సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 21వరకు**
**41 రోజుల పాటు అన్నదానం..**
**మాలలో ఉన్నవారికి లేని వారికీ భోజన వసతి**



మేడ్చల్, అక్టోబర్ 14: ( మనం జిల్లా ప్రతినిధి ): సేవ చేయాలనే సంకల్పం.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే మంచి మనసు.. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలనే మానవత్వం.. ఇవే ఒక వ్యక్తికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తాయి. తండ్రి చూపిన సేవామార్గంలో పయనిస్తూ, తనవంతుగా సమాజానికి సేవలందిస్తున్న రామన్నగారి మణికంఠ గౌడ్ స్థానికంగా సేవాభావానికి ప్రతీకగా నిలుస్తున్నారు. ఒకప్పుడు చిలుక రాజు.. ఇప్పుడు మణికంఠ గౌడ్.. సేవలో తండ్రిని మించిన తనయుడు అంటూ ఆయన సేవలను తెలిసినవారు అభివర్ణిస్తున్నారు.

## తండ్రి అడుగుజాడల్లో తనయుడి ప్రస్థానం

కీర్తిశేషులు రామన్నగారి రాజేశ్వర్ గౌడ్ (చిలుక రాజు), మాజీ సర్పంచ్గా ప్రజలకు అందించిన సేవలు స్థానికులకు సుపరిచితం. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, అవసరమైన సమయంలో అండగా నిలిచే వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. తండ్రి నుంచి అందిపుచ్చుకున్న సేవాభావాన్ని రామన్నగారి మణికంఠ గౌడ్ కూడా కొనసాగిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

అమెరికాలో ఎం.ఎస్. (యూఎస్ఏ) పూర్తి చేసిన మణికంఠ గౌడ్, మాజీ కౌన్సిలర్గా ప్రజాజీవితంలో అనుభవం సంపాదించారు. ఫిలాంత్రపిస్ట్గా సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, సామాజిక సేవకు తనవంతు సహకారం అందిస్తున్నారు.

## 41 రోజుల పాటు అన్నదానం.. మాలలో ఉన్నవారికి లేని వారికీ భోజనం

మేడ్చల్లోని శ్రీశ్రీ గడిమైసమ్మ తల్లి దేవస్థానంలో భవానీ దీక్షల సందర్భంగా రామన్నగారి మణికంఠ గౌడ్ అన్నదాన కార్యక్రమానికి ప్రాధాన్యతనిచ్చారు. 2026 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 21 వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో దీక్షలో ఉన్న భవానీ భక్తులతో పాటు, మాల ధరించని వారికి కూడా అన్నదానం అందించడం ప్రత్యేకంగా నిలిచింది.

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకే కాకుండా, అక్కడికి వచ్చిన ఇతరులకు కూడా భోజనం అందించడం ద్వారా అన్నదానంలోని సమానత్వ భావనను చాటారు. ఆకలితో వచ్చినవారికి కడుపునిండా అన్నం పెట్టడం ద్వారా సేవకు కులమతాలు, ఆచార వ్యవహారాలు అడ్డుకావని, మానవత్వమే ముఖ్యమనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది.

అన్నదానం మహాదానం అనే భావనకు అనుగుణంగా 41 రోజుల పాటు భోజన సదుపాయం కల్పించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు.

## ఆపదొస్తే అండగా.. అవసరమైతే ముందడుగు

మనిషి విలువ మాటల్లో కాదు.. అవసరమైన సమయంలో చేసే సాయంలో కనిపిస్తుంది. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, సాధ్యమైనంత సహాయం అందించడం, ప్రజల సమస్యల పట్ల స్పందించడం వంటి లక్షణాలే ఒక వ్యక్తికి ప్రజల్లో గౌరవాన్ని తీసుకొస్తాయి.




ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయం అందించేందుకు ముందుండే వ్యక్తిగా రామన్నగారి మణికంఠ గౌడ్ను ఆయనకు పరిచయమైనవారు గుర్తుచేసుకుంటున్నారు. తండ్రి చిలుక రాజు ప్రజలకు అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని, అదే బాటలో తనయుడు ముందుకు సాగడం స్థానికంగా చర్చనీయాంశంగా నిలుస్తోంది.

## భక్తి.. సేవ.. సమాజ శ్రేయస్సు

శ్రీశ్రీ గడిమైసమ్మ తల్లి దేవస్థానంలో 41 రోజుల భవానీ దీక్ష విరమణ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించడంతో పాటు అన్నదానానికి ప్రాధాన్యత ఇవ్వడం మణికంఠ గౌడ్ సేవా దృక్పథాన్ని ప్రతిబింబిస్తోంది. భక్తులకు మాత్రమే కాకుండా, మాల ధరించని వారికి కూడా అన్నం అందించడం ద్వారా అందరినీ సమానంగా చూడాలనే మంచి సందేశాన్ని అందించారు.

## సేవే నిజమైన గుర్తింపు

పదవులు, హోదాలు తాత్కాలికం.. ప్రజలకు చేసిన సేవ మాత్రం చిరకాలం గుర్తుండిపోతుంది. తండ్రి సంపాదించిన మంచి పేరును నిలబెట్టుకుంటూ, తనదైన శైలిలో సేవా కార్యక్రమాలకు తోడ్పడటం అభినందనీయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు చిలుక రాజు.. ఇప్పుడు రామన్నగారి మణికంఠ గౌడ్.. తరాలు మారినా సేవా మార్గం మారలేదు. తండ్రి చూపిన బాటలో తనయుడు నడుస్తూ, అన్నదానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా కుటుంబ సేవా వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు.

# విద్యాసంస్థల్లో మతపరమైన వివక్షకు తావులేదు!

**హిందూ ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదు!**

**భవానీ మాత దీక్షలో ఉన్న విద్యార్థులను అవమానించడం తగదు**

**మత విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది**

**అనురాగ్ యూనివర్సిటీ వైద్య కళాశాల యాజమాన్యంతో చర్చలు**

**విద్యార్థులకు క్షమాపణలు తెలిపినట్లు సమాచారం**

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి హెచ్చరిక**




ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 14: విద్యాసంస్థలు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే పవిత్ర కేంద్రాలుగా ఉండాలే తప్ప మతపరమైన వివక్షకు వేదికలుగా మారకూడదని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. హిందూ ధర్మాన్ని, భక్తుల మనోభావాలను కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ ఏదులాబాద్ డివిజన్ ఔషాపూర్లోని అనురాగ్ యూనివర్సిటీ నీలిమ వైద్య కళాశాలలో భవానీ మాత మాలధారణ చేసి దీక్షలో ఉన్న విద్యార్థుల పట్ల కొందరు అధ్యాపకులు, డీన్ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. దీక్ష తీసుకుంటే చదువులు ఎలా కొనసాగిస్తారంటూ విద్యార్థుల మత విశ్వాసాలను కించపరిచేలా మాట్లాడినట్లు ఆరోపణలు రావడంతో కళాశాలకు చేరుకుని బాధిత విద్యార్థులను పరామర్శించారు. జరిగిన విషయాలను అడిగి తెలుసుకుని వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**విద్యార్థుల మనోభావాలను దెబ్బతీయొద్దు!**

అనంతరం కళాశాల యాజమాన్యంతో సుదర్శన్ రెడ్డి చర్చలు జరిపారు. విద్యార్థులు తమ మత విశ్వాసాలకు అనుగుణంగా దీక్షలు చేపట్టడం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా, వారి మనోభావాలు దెబ్బతినకుండా యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు. మతపరమైన ఆచారాలను కారణంగా చూపుతూ విద్యార్థులను అవమానించడం సరికాదన్నారు.

**అన్ని మతాల విశ్వాసాలను సమానంగా గౌరవించాలి!**

ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇతర మతాల ఆచారాలు, సంప్రదాయాలను ఏ విధంగా గౌరవిస్తామో హిందూ ధర్మాన్ని, హిందువుల విశ్వాసాలను కూడా అదే విధంగా గౌరవించాలని డిమాండ్ చేశారు. భవానీ మాత దీక్ష చేపట్టడం భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఏ మతానికి చెందిన వారైనా ఇతరుల విశ్వాసాలను కించపరిచే విధంగా వ్యవహరించడం తగదన్నారు. విద్యార్థుల మధ్య మత సామరస్యం, పరస్పర గౌరవం పెంపొందించాల్సిన అధ్యాపకులే వివాదాలకు కారణమయ్యారనే ఆరోపణలు రావడం బాధాకరమన్నారు.

**మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలి!**

విద్యాసంస్థల్లో మతపరమైన వివక్షకు తావులేకుండా యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. విద్యార్థుల మత విశ్వాసాలను గౌరవించడంతోపాటు వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలన్నారు. హిందూ ధర్మాన్ని కించపరిచే వ్యాఖ్యలు పునరావృతమైతే సహించేది లేదని స్పష్టం చేశారు. అన్ని మతాల పట్ల సమాన గౌరవం చూపడమే నిజమైన మత సామరస్యమని పేర్కొన్నారు.

**చర్చల అనంతరం క్షమాపణలు!**

కళాశాల యాజమాన్యంతో జరిగిన చర్చల అనంతరం విద్యార్థులకు క్షమాపణలు తెలిపినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. విద్యాసంస్థలు విద్యాబోధనతోపాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సహనం, పరస్పర గౌరవం, మత సామరస్యాన్ని పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాగరాజు, ఘట్కేసర్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు అనిల్ గౌడ్, కాసుల వెంకటేష్ గౌడ్, భరత్ యాదవ్, సాయి గౌడ్, భవానీ మాత భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

# కాప్రా సర్కిల్లో భారీ షెడ్ నిర్మాణం.. అనుమతులు ఉన్నాయా?

**రాధిక థియేటర్- మౌలాలి ప్రధాన రహదారి పక్కన నిర్మాణం.**

**పనులు నిలిపివేసినా తిరిగి ప్రారంభమవుతున్నాయంటున్న స్థానికులు.**

**టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై ప్రజల ప్రశ్నలు..**



కాప్రా సర్కిల్, అక్టోబర్ 14 (మనం న్యూస్): కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావు నగర్ డివిజన్లో రాధిక థియేటర్ నుంచి మౌలాలి వెళ్లే ప్రధాన రహదారి పక్కన భారీ షెడ్ నిర్మాణం కొనసాగుతుండటంపై స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. స్థానికుల కథనం ప్రకారం, టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలో ఒకటిరెండు సార్లు నిర్మాణ పనులను నిలిపివేసినప్పటికీ, తిరిగి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎందుకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చిన్న నిర్మాణాలపై వెంటనే స్పందించే అధికారులు.. భారీ నిర్మాణంపై ఎందుకు మౌనం? సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టినా నిబంధనల పేరుతో నోటీసులు జారీ చేసే అధికారులు, ప్రధాన రహదారి పక్కనే భారీ షెడ్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ ఎందుకు స్పందించడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు.




ఈ నిర్మాణం వెనుక రాజకీయ పలుకుబడి ఉందా? లేక అధికారుల నిర్లక్ష్యమా? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అయితే, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, అధికారుల చర్యలు, ఇతర ఆరోపణలపై సంబంధిత శాఖ నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది.

**జీహెచ్ఎంసీ ఆదాయానికి గండిపడుతోందా?**

నిర్మాణానికి అవసరమైన అనుమతులు లేకుండా పనులు కొనసాగుతున్నట్లయితే జీహెచ్ఎంసీ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భవన నిర్మాణ నిబంధనల అమలు, అధికారులు గత చర్యలపై సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు. గతంలోనూ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, ఈ వ్యవహారంలోనైనా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి నిర్మాణానికి సంబంధించిన అనుమతుల వివరాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే పనులు నిలిపివేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రధాన రహదారి పక్కన కొనసాగుతున్న ఈ నిర్మాణంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

---



# చేవెళ్ల పట్టణ అభివృద్దే లక్ష్యం

**మున్సిపల్ చైర్ పర్సన్**

**రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం**

చేవెళ్ల, అక్టోబర్ 14(మనం న్యూస్): చేవెళ్ల మున్సిపాలిటీలోని 12వ, 13వ వార్డుల్లో మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 13వ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ రాము గౌడ్, 12వ వార్డు కౌన్సిలర్ మనీషా అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా...... మున్సిపల్ చైర్పర్సన్ సమత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...... చేవెళ్ల మున్సిపాలిటీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకువచ్చి చేవెళ్ల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, కృష్ణ నాయక్, బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, చేవెళ్ల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఇంద్రసేన రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, జయసింహ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు...



# బార్ల టెండర్లకు రంగం సిద్ధం

**ఈ నెల 16న ఉదయం**

**9:30 గంటలకు టెండర్ల ప్రక్రియ**

**అజీజ్‌నగర్లోని పీవీ కన్వెన్షన్ హాల్లో నిర్వహణ**

చేవెళ్ల, అక్టోబర్ 14(మనం న్యూస్): చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల పరిధిలో నూతన బార్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 16వ తేదీన (శుక్రవారం) టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం 9:30 గంటలకు మొయినాబాద్ మండలం అజీజ్నగర్ గ్రామంలోని వీజేటీ కళాశాల సమీపంలో ఉన్న పీవీ కన్వెన్షన్ హాల్లో ఈ ప్రక్రియ జరగనుంది. టెండర్ల ప్రక్రియలో పాల్గొనే అభ్యర్థులు నిర్ణీత సమయానికి వేదిక వద్దకు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఎంట్రీ పాస్ ఉన్నవారికే మాత్రమే హాల్లోకి ప్రవేశం కల్పిస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థుల తరఫున ప్రతినిధులు హాజరయ్యే పక్షంలో సంబంధిత అధికారిక అనుమతి పత్రం (ఆథరైజేషన్ లెటర్) తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు.

అలాగే, హాల్లోకి మొబైల్ ఫోన్లను అనుమతించబోమని అధికారులు వెల్లడించారు. సంబంధిత అభ్యర్థులందరూ నిబంధనలు పాటిస్తూ టెండర్ల ప్రక్రియకు హాజరుకావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, డీపీఈఓ, ఫ్యూచర్ సిటీ, రంగారెడ్డి జిల్లా అధికారులు కోరారు.

# ఓటరు నమోదుకు రెండు రోజుల ప్రత్యేక శిబిరాలు

**అక్టోబర్ 15 16 తేదీల్లో చేవెళ్ల డివిజన్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ**



చేవెళ్ల, అక్టోబర్ 14(మనం న్యూస్): ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులను ఓటర్లుగా నమోదు చేసేందుకు అక్టోబర్ 15, 16 తేదీల్లో చేవెళ్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముఖ్యంగా తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకునే యువతీ యువకులతో పాటు, ఓటరు జాబితాలో పేర్లు లేని ఇతర అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటరుగా నమోదు కోసం ఫారం-6 దరఖాస్తును సమర్పించాలని తెలిపారు.శిబిరాలు నిర్వహించే రెండు రోజుల పాటు సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ఏలు) పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి, ఓటరు నమోదు ప్రక్రియకు అవసరమైన సహకారం అందిస్తారని వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని,ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి కోరారు.

# ఎల్‌నినో ప్రభావం.. కరువు కట్టడికి ముందస్తు కార్యాచరణ!

**తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళికలు**

**పశుగ్రాసం నిల్వ, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ప్రతేక దృష్టి**

**అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది జూన్ వరకు కార్యాచరణ అమలు: షాబాద్ మండల ప్రత్యేక అధికారి జి.వెంకట నారాయణ**



షాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్నినో ప్రభావంతో పొంచి ఉన్న కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బుధవారం షాబాద్ మండల స్థాయిలో ముందస్తు కార్యాచరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. మండల ప్రత్యేక అధికారి జి.వెంకట నారాయణ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, అక్టోబర్ 2026 నుంచి జూన్ 2027 వరకు అమలు చేయవలసిన కార్యాచరణ ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు.

**తాగునీటి సంరక్షణకు ప్రాధాన్యం**

ఎండల తీవ్రత పెరిగి తాగునీటి కొరత ఏర్పడే అవకాశమున్నందున నీటి వినియోగంలో పొదుపు పాటించాలని అధికారులు సూచించారు. కుళాయిలకు ఆన్-ఆఫ్ సదుపాయాలు ఏర్పాటు చేయడంతోపాటు, పైప్లైన్ లీకేజీలను తక్షణమే అరికట్టాలని, ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు.

**పశుగ్రాస కొరత నివారణకు చర్యలు**

కరువు పరిస్థితుల్లో పశువులకు మేత కొరత తలెత్తకుండా ప్రస్తుత పంటల వ్యర్థాలను భద్రపరచాలని రైతులకు సూచించారు. పశువులను కలిగిన రైతులు తమ పొలాల్లో పశుగ్రాసం సాగుకు ప్రత్యేక స్థలం కేటాయించి, ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

**యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి**

లోటు వర్షపాతం కారణంగా వ్యవసాయ రంగం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, యాసంగి సాగులో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు.

**ఉపాధి కల్పనకు పనుల గుర్తింపు**

పంటల దిగుబడులు తగ్గి గ్రామీణ ప్రజల జీవనోపాధిపై ప్రభావం పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పించేందుకు అవసరమైన పనులను ముందుగానే గుర్తించాలని అధికారులకు సూచించారు.

**భూగర్భ జలాల పెంపునకు జల సంరక్షణ**



వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలమట్టాలను పెంపొందించేందుకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, వ్యవసాయ క్షేత్రాల్లో పంట కుంటలు, సామూహిక సోక్పిట్లు, బోరుబావుల రీచార్జ్ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల వారీగా అవసరాలను గుర్తించి, జల సంరక్షణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ఈ అంశాలన్నింటిపై గ్రామ పంచాయతీ సమావేశాల్లో విస్తృతంగా చర్చించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, ఆర్డబ్ల్యూఎస్ డీఈ, ఎంపీవో, విద్యుత్, ఇరిగేషన్ ఏఈలు, ఏపీవో, వైద్యాధికారి, వ్యవసాయ అధికారి, పశువైద్యాధికారి, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

**బాధితురాలికి రూ.50 వేల పరిహారం.**



జవహర్నగర్, అక్టోబర్ 14 (మనం న్యూస్): పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మేడ్చల్ జిల్లాలోని ఫాస్ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది.

జవహర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో నమోదైన క్రైమ్ నంబర్ 178/2018 కేసులో భారతీయ శిక్షాస్మృతిలోని 448, 354 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 8 కింద కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి ఎస్సీ నంబర్ 152/2020లో విచారణ చేపట్టిన మేడ్చల్ జిల్లా అత్యాచారం, పోక్సో కేసుల సత్వర విచారణ ప్రత్యేక న్యాయస్థానం నిందితుడు కలాశెట్టి దినేష్ కుమార్కు శిక్ష విధించింది.

నిందితుడికి ఐపీసీ సెక్షన్ 448 కింద జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా, సెక్షన్ 354 కింద జైలు శిక్షతో పాటు మరో రూ.1,000 జరిమానా విధించింది. అలాగే పోక్సో చట్టంలోని సెక్షన్ 8 కింద మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించింది. బాధితురాలికి రూ.50,000 పరిహారం అందించాలని న్యాయస్థానం ఆదేశించింది.

ఈ కేసు పర్యవేక్షణ అధికారిగా జవహర్నగర్ పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ ఎస్. సైదులు వ్యవహరించారు.



# మాచన్పల్లి చౌరస్తాలో ఆర్జేఎస్ కార్ వాషింగ్ సెంటర్ ప్రారంభం

**యువత స్వయం ఉపాధితో ఎదగాలి: నేరెట్ల మహేందర్ గౌడ్**

షాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్ ) : షాబాద్ మండలం మాచన్పల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్జేఎస్ కార్ వాషింగ్ సెంటర్ను బుధవారం శ్రీ ఓం డెవలపర్స్ అధినేత నేరెట్ల మహేందర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ, యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి మార్గంలో ఎదగాలని, చిన్న వ్యాపారాలతో ప్రారంభించి భవిష్యత్తులో పెద్ద వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. వాషింగ్ సెంటర్ యజమాని రాజేష్కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు శేరిగూడెం వెంకటయ్య, పెద్దవేడు మాజీ సర్పంచ్ గొండ్ల శ్రీనివాస్ గౌడ్, మాచన్పల్లి గడ్డమీది వెంకటయ్య , అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని అక్రమ నిర్మాణం

**సర్వే నంబర్ 868/4లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారంటూ ఆరోపణలు**

**అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు జరుగుతున్నాయా?**

**చౌదరిగూడలో గౌతమ్ స్కూల్ సమీపంలో వివాదాస్పద నిర్మాణం**

**టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

**22ఏ జాబితాలో ఉన్న భూమిలో నిర్మాణానికి అనుమతులు ఎలా?**

**తక్షణమే విచారణ చేపట్టి నోటీసులు జారీ చేయాలని స్థానికుల డిమాండ్**

ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 14: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్ చౌదరిగూడ గ్రామంలో అనుమతులు లేని నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గౌతమ్ స్కూల్ సమీపంలోని సర్వే నంబర్ 868/4లో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నట్లు చెబుతున్న భూమిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు చేపట్టారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**అనుమతులు లేకుండానే నిర్మాణమా?**

సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టాలన్నా అనేక నిబంధనలు పాటించాల్సి వస్తుండగా, వివాదాస్పద భూమిలో నిర్మాణ పనులు ఎలా కొనసాగుతున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణానికి సంబంధించిన మున్సిపల్ అనుమతులు, భూమి యాజమాన్య పత్రాలు, సర్వే వివరాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**22ఏ భూమిలో నిర్మాణంపై అనుమానాలు!**

సర్వే నంబర్ 868/4లోని భూమి నిజంగానే రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ నిషేధిత జాబితాలో ఉందా? ఉంటే ఏ కారణంతో ఆ జాబితాలో చేర్చారు? ప్రస్తుతం ఆ భూమి చట్టపరమైన స్థితి ఏమిటి? అనే అంశాలపై రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. నిషేధిత జాబితాలో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూమిలో నిర్మాణం చేపట్టడంపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

**టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

ఘట్కేసర్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్



అధికారులు ఈ నిర్మాణాన్ని పరిశీలించారా? నిర్మాణదారులు అనుమతులు పొందారా? నిబంధనలకు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. నిర్మాణం అక్రమమని తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులారా.. స్పందించండి!**

చౌదరిగూడ గౌతమ్ స్కూల్ సమీపంలోని సర్వే నంబర్ 868/4 భూమిపై రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. భూమి 22ఏ జాబితాలో ఉందో లేదో నిర్ధారించడంతోపాటు నిర్మాణ అనుమతులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టినట్లు తేలితే వెంటనే నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం పనులను నిలిపివేయాలని కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఈ నిర్మాణంపై విచారణ చేపడతారా? లేక ఆరోపణలను పట్టించుకోకుండా వదిలేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

## సీసీ కెమెరాల సాయంతో తప్పిపోయిన వ్యక్తి గుర్తింపు

**హెచ్బీ కాలనీలో తప్పిపోయిన వ్యక్తి క్షేమం.. కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు**



కుషాయిగూడ, అక్టోబర్ 14 (మనం న్యూస్): కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధి హెచ్ బీ కాలనీ నుంచి నిన్న తప్పిపోయిన వ్యక్తిని పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి, క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈరోజు రాత్రి 8 గంటల సమయంలో సీసీ కెమెరాల ద్వారా సదరు వ్యక్తి ఆచూకీని గుర్తించారు. వెంటనే స్పందించిన పోలీస్ బృందం ఘటనా స్థలానికి చేరుకుని, వ్యక్తిని గుర్తించి క్షేమంగా ఉన్నట్లు నిర్ధారించింది. అనంతరం అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తప్పిపోయిన వ్యక్తిని సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల అనంతరం సీసీ రోడ్డు నిర్మాణం

**నాణ్యతను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు.**



కుషాయిగూడ, అక్టోబర్ 14 (మనం న్యూస్): 19వ డివిజన్ పరిధిలోని హెచ్బీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య పరిశీలించారు. హెచ్బీ కాలనీలో ఫస్ట్ ఫేజ్ గ్రౌండ్ ఎదురుగా, ఓం శాంతి బిల్డింగ్ పక్కన అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన అనంతరం నిర్మించిన సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ విధానం, పనుల నాణ్యతను పరిశీలించి, నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, అనిల్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల గౌరవ పరిరక్షణకు తొమ్మిది ప్రతిజ్ఞలు చేయాలి

**మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద పిలుపు..**



సికింద్రాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) మహిళల భద్రత, గౌరవ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తొమ్మిది ప్రతిజ్ఞలు చేయాలని తెలంగాణ మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద పిలుపునిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో





బుధవారం ఓయూ పరిపాలన భవనం వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా నేరెళ్ల శారద మాట్లాడుతూ మహిళలను గౌరవించడం, వారి భద్రతకు భరోసా కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా వేడుకల్లో మహిళలను వారి అనుమతి లేకుండా చిత్రీకరించడం, ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం, అసభ్యకరంగా ప్రచారం చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. మహిళల ప్రతిష్ఠకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని అరికట్టాలని సూచించారు. మహిళలకు గౌరవం, భద్రత కల్పించే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

# జపాన్ ఫెస్టివల్ లో సత్తా చాటిన సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల

మేడ్చల్,అక్టోబర్ 14: ( మనం జిల్లా ప్రతినిధి ): గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధి మైసమ్మగూడ లోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల జపాన్ ఫెస్టివల్-2026లో అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు సాధించింది. అక్టోబర్ 11న నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.

ఇండియా-జపాన్ ఇన్నోవేషన్ హ్యాకథాన్లో భాగంగా నిర్వహించిన వివిధ ప్రాంతీయ హ్యాకథాన్ల అనంతరం, దేశవ్యాప్తంగా కేవలం 21 ఆవిష్కరణలు మాత్రమే జపాన్ ఫెస్టివల్లో ప్రదర్శనకు ఎంపిక కాగా, వాటిలో ఐదు ఆవిష్కరణలు సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందినవే కావడం విశేషం.

అంతేకాకుండా, కళాశాలకు చెందిన ఒక ఆవిష్కరణ టాప్-5 అవార్డు పొందిన ఆవిష్కరణల్లో స్థానం సంపాదించింది. ఈ ఆవిష్కరణ భారతదేశం, జపాన్కు చెందిన అధికారులు మరియు పెట్టుబడిదారుల ప్రశంసలు, గుర్తింపును పొందింది.




భారత్-జపాన్ సహకారాన్ని బలోపేతం చేయడంలో చేసిన కృషికి గాను కళాశాలకు భారత్-జపాన్ సహకార వారధి గుర్తింపు పురస్కారం కూడా లభించింది. ఈ కార్యక్రమంలో స్పెక్ విద్యార్థులు నిర్వాహక బృంద సభ్యులుగా, వాలంటీర్లుగా చురుకుగా పాల్గొని అంతర్జాతీయ వేదికపై కళాశాలకు ప్రాతినిధ్యం వహించారు.

ఈ విజయంపై కళాశాల చైర్మన్ టి. బాలా రెడ్డి, సెక్రటరీ టి. వి. రెడ్డి, డైరెక్టర్లు శ్రీమతి టి. సరోజా రెడ్డి, టి. అనురాగ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. వెంకట రావు విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. అంతర్జాతీయ వేదికపై కళాశాలకు గుర్తింపు తీసుకురావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డా. గౌతమ్ మామిడిశెట్టి, డీన్ - ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ , కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, డీన్లు, విభాగాధిపతులు హెచ్ ఓ డి లు , బృందం, వివిధ విద్యార్థి క్లబ్లకు నిరంతర సహకారం, ప్రోత్సాహం, కృషికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ విజయం ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తల అభివృద్ధి, అంతర్జాతీయ భాగస్వామ్యాల దిశగా సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది.

---

# నాచారం సర్కిల్ అధికారుల కనుసన్నల్లోనే ‘అదనపు’ కట్టడాలా?

**అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా!**

**సెట్బ్యాక్లు, పార్కింగ్ నిబంధనలకు తూట్లు?**

**ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యమంటున్న స్థానికులు.**

**అక్రమ నిర్మాణాలపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్.**

నాచారం సర్కిల్, అక్టోబర్ 14 (మనం న్యూస్): నాచారం సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. మీర్పేట్ హెచ్బీ కాలనీ నుంచి ఎన్ఎఫ్సీకి వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ఉన్న ఓ భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతించిన భవన నిర్మాణ ప్రణాళికకు భిన్నంగా అదనపు నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



**అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా!**

భవన నిర్మాణానికి మంజూరైన అనుమతులకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా? అదనపు అంతస్తులు లేదా ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం వదలాల్సిన సెట్బ్యాక్లు, పార్కింగ్ స్థలాలను సక్రమంగా పాటిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర పరిశీలన జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఫిర్యాదులు చేసినా స్పందన లేదా?**

అదనపు నిర్మాణాలపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, భవన నిర్మాణ అనుమతులు, వాస్తవ నిర్మాణాల మధ్య ఉన్న వ్యత్యాసాలను గుర్తించాలని కోరుతున్నారు.

సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టినప్పుడు నిబంధనల పేరుతో చర్యలు తీసుకునే అధికారులు, భారీ బహుళ అంతస్తుల భవనాల విషయంలోనూ అదే స్థాయిలో నిబంధనలు అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతపై ప్రశ్నలు!**

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో నాచారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి!**

నాచారం సర్కిల్ పరిధిలోని అనుమానాస్పద నిర్మాణాలపై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత భవనానికి మంజూరైన ప్లాన్ను పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న నిర్మాణాలతో సరిపోల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

**నిబంధనలు అందరికీ సమానంగా అమలవుతాయా?**

నాచారం సర్కిల్లో అదనపు నిర్మాణాలపై వస్తున్న ఆరోపణలపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? భవన నిర్మాణ అనుమతులు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పుడు స్పష్టత ఇస్తారు? అన్న ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించినప్పుడే ఈ వివాదానికి తెరపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

---



# నాచారం సర్కిల్ లో కమిషనర్ విస్తృత పర్యటన

**ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు..**

**పారిశుద్ధ్యం, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి..**

**భవన నిర్మాణ నిబంధనల అమలు,**

**పార్కుల అభివృద్ధికి అధికారులకు ఆదేశాలు..**



నాచారం, అక్టోబర్ 14 (మనం న్యూస్) మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి బుధవారం నాచారం సర్కిల్ పరిధిలో విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, దోమల నివారణ, భవన నిర్మాణ నిబంధనల అమలు, పార్కుల అభివృద్ధిపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎన్టీఆర్ సర్కిల్, ఏపీఎచ్బీ కాలనీల్లో ట్రాఫిక్ సమస్యలను పరిశీలించిన కమిషనర్, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఫ్రీ లెఫ్ట్ మలుపులకు తగిన స్థలం కల్పించాలని ఆదేశించారు. రహదారి ఆక్రమణలను పరిశీలించి, విద్యుత్ స్తంభాల మార్పిడిపై సంబంధిత శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఏపీఎచ్బీ కాలనీలో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను నిరంతరం శుభ్రం చేయాలని, ఇంటింటి చెత్త సేకరణను పర్యవేక్షించాలని సూచించారు. నాచారం ఎన్ఎఫ్సీ రోడ్డులో దోమల లార్వా వృద్ధి ప్రాంతాలను పరిశీలించి, యాంటీ లార్వల్ ఆపరేషన్లు, ఫాగింగ్తో పాటు శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో భవన నిర్మాణ అనుమతులను పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలన్నారు. వార్డు 18 గోకుల్ నగర్ పార్కులో స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, మొక్కల సంరక్షణపై శిక్షణ అందించాలని సూచించారు. పరిశుభ్రమైన, సురక్షితమైన నగర నిర్మాణానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.

# వైశాలి నగర్ కాలనీ లో గల రైల్వే అండర్ పాస్ ను ప్రారంభించిన పిఏసి చైర్మన్ ఆరేకపూడి గాంధీ.

మనం న్యూస్ // మియాపూర్, అక్టోబర్ 14: హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ కాలనీ లో గల రైల్వే అండర్ బ్రిడ్జి రూ. 70 లక్షల రూపాయల అంచనావ్యయంతో జరుగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయిన శుభసందర్భంగా రైల్వే అండర్ పాస్ ను జోనల్ కమిషన్ నారాయణ్ అమిత్ మాలెం పాటి , డీసీ శ్రీ సేవా ఇస్లావత్ , ట్రాఫిక్ ఏసీపీ ఆదిమూర్తి , ట్రాఫిక్ సి ఐ నర్సింహ రెడ్డి , సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి , సిఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా పి ఏ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ మంజీరా పైప్ లైన్ రోడ్డు నుండి మసీదు బండ కు వెళ్లే రోడ్డు లో గల రైల్వే అండర్ పాస్ రోడ్డును ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని, నేటి తో ట్రాఫిక్ కష్టాలు తీరునని, ప్రజలకు సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేయడం జరుగుతుంది అని, నేటి నుండి సులభతరంగా రెండు వాహనాలు ప్రయాణించే



విధంగా అండర్ పాస్ ను తీర్చిదిద్దడం జరిగినది అనీ ఆయన అన్నారు. రైల్వే అండర్ పాస్ వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, ఉదయం , సాయంత్రం మరింత ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతుంది అని, ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని రూ. 70 లక్షల రూపాయలతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు, సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడం జరిగినది అని, ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని, పనులు త్వరితగతిన పూర్తి చేసి నేటి తో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగినది వారు తెలియచేశారు. చుట్టుపక్కల కాలనీల వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని, శాశ్వత పరిష్కారం దిశగా అన్ని రకాల చర్యలును తీసుకోవాలని, పక్కా ప్రణాళికలు వేసుకొని పనులు ప్రారంభించడం జరిగినది అని ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా అండర్ పాస్ ను తీర్చిదిద్దడం జరిగినది అని ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది సంతోషం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సిఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎస్ ఇ శంకర్ నాయక్,ఈ ఈ శిరీష, డి ఇ ఆనంద్, ఏ ఇ భాస్కర్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

---

## బీజేపీ బిల్డర్ సెల్ మహంకాళి జిల్లా కన్వీనర్‌గా హనుమాన్ ముదిరాజ్

**బిల్డర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..**

**పార్టీ బలోపేతం, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతా..**



సికింద్రాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) భారతీయ జనతా పార్టీ మహంకాళి జిల్లా బిల్డర్ సెల్ కన్వీనర్ గా నియమితులైన హనుమాన్ ముదిరాజ్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, డాక్టర్ కె. లక్ష్మణ్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణితో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హనుమాన్ ముదిరాజ్ పేర్కొన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, బీజేపీ అభివృద్ధికి, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, బిల్డర్ సెల్ ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## ఏపీఎల్లో చెరో ఆర్చర్స్‌పై పృథ్వీరాజ్ యోధాస్ విజయం

హైదరాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) సీజన్-2లో పృథ్వీరాజ్ యోధాస్ 5-1తో చెరో ఆర్చర్స్పై విజయం సాధించింది. 16 ఏళ్ల గాథా ఆనందరావు ఖడకే 60కి 58 పాయింట్లు, ఆసియా క్రీడల కాంపౌండ్ పతక విజేత గణేశ్ తిరుమూరు 59 పాయింట్లతో రాణించారు. కుమ్కుమ్ మొహోద్ స్థానంలో బరిలోకి దిగిన అమెరికా ఆర్చర్ కేసీ కౌఫ్హోల్ ఆశించిన ప్రదర్శన చేయలేకపోయారు. మథియాస్ గ్రాండే మూడో సెట్ను 77-74తో ముగించి యోధాస్కు విజయాన్ని అందించారు. దీంతో చెరో ఆర్చర్స్ వరుసగా మూడో ఓటమిని చవిచూసింది. హైదరాబాద్లోని పీపుల్స్ ప్లాజాలో జరుగుతున్న లీగ్ అక్టోబర్ 18న ముగియనుంది.



---

## ఊరెళ్తున్నారా.. దొంగలకు ఛాన్స్ ఇవ్వకండి!

**దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి**

**తాళం వేసిన ఇళ్లే దొంగల టార్గెట్.. జాగ్రత్త!**

**నగదు, బంగారం ఇంట్లో ఉంచి వెళ్లొద్దు**

**అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి**

**ఘట్కేసర్ సీఐ ఎం.బాలస్వామి సూచనలు**




ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 14: దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్తున్నారా..? అయితే మీ ఇంటి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టండి. పండుగ ఆనందంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా దొంగలకు అవకాశం ఇచ్చినట్లేనని ఘట్కేసర్ సీఐ ఎం.బాలస్వామి ప్రజలను అప్రమత్తం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా సెలవులకు ఊళ్లకు వెళ్లే కుటుంబాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**తాళం వేసి వెళ్తే జాగ్రత్తలు తప్పనిసరి!**

పండుగ సెలవుల్లో తాళాలు వేసిన ఇళ్లను దొంగలు లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉందని, ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు ఉంచకుండా భద్రపరచుకోవాలని సూచించారు. ఇంటి తలుపులు, కిటికీలు సరిచూసుకోవడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఊరికి వెళ్లే విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో వెల్లడించవద్దని సూచించారు.

**అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలి**

కాలనీల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇంటి భద్రత విషయంలో పొరుగువారి సహకారం తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

**చిన్న నిర్లక్ష్యం.. భారీ నష్టం!**

పండుగ సంతోషం విషాదంగా మారకుండా ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని సీఐ బాలస్వామి సూచించారు. ప్రజల భద్రతకు పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, నేరాల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ముందస్తు జాగ్రత్తలతో దొంగతనాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు.

---

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం: చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డి

శామీర్ పేట్, అక్టోంబర్ 14 ( మనం ): పేదలకు ఇళ్లు కట్టించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకొచ్చింది. విడతల వారీగా నిధులు కేటాయిస్తూ ఇల్లులేని వారికి సొంతింటి కల నెరవేరుస్తుందాని అలియాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ శిరీష కృష్ణ రెడ్డి అన్నారు. బుధ వారం అలియాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు (లాల్ గడి మలక్ పేట్ ) లోని కావటి సరిత మురళి ల నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిరు పేదలకు, అర్హులందరికీ అందజేస్తామన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ఒక నిరంతర ప్రక్రియ అని పేదలందరికీ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వెంకట్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి,జిల్లా కార్యదర్శి భూమి రెడ్డి నవీన్ రెడ్డి, అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు తునికి రమేష్ కాంగ్రెస్ నాయకులు బండరి బాబు,అబ్బాగౌని భాస్కర్ గౌడ్, చిలుగురి మల్లేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేణు గోపాల్ రెడ్డి,ఇప్ప మాధవ రెడ్డి, బండ సతీష్,కుంచె సత్యనారాయణ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహంకాళి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన గాయత్రి మాత!

**అన్నోజిగూడ గాయత్రి మాత ఆలయంలో ఆధ్యాత్మిక శోభ**

**వేదమంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా నవచండీ హోమం**

**వరికుప్పల రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం**

**అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు**

ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 14: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పోచారం డివిజన్ 8 పరిధిలోని అన్నోజిగూడ గాయత్రి మాత ఆలయం బుధవారం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. మహంకాళి అవతారంలో ప్రత్యేక అలంకరణతో గాయత్రి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో నిండిపోయింది.

**వేదమంత్రాల నడుమ ప్రత్యేక హోమాలు**

ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి, లక్ష్మీగణపతి, నవగ్రహ సహిత నవచండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తిక్ పంతులు, కౌశిక్ పంతులు, రామ్మూర్తి పంతులు, వేణుగోపాల్ పంతులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు హోమ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శ్రేయస్సు కోసం అమ్మవారిని ప్రార్థించారు.

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

ప్రత్యేక పూజల అనంతరం వరికుప్పల రవీందర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తుల సందడి, అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అకిటి బాల్రెడ్డి, నాయకులు లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కార్తిక్ పంతులు, కౌశిక్ పంతులు, రామ్మూర్తి పంతులు, వేణుగోపాల్ పంతులు, వినీల్, కౌశల్, నవనీత్తో పాటు స్థానికులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.





# అన్నోజిగూడ ఫ్లైఓవర్‌పై మంటల్లో దగ్ధమైన కారు!

**హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తుండగా అగ్నిప్రమాదం**

**రెనాల్ట్ డస్టర్ పెట్రోల్ కారులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు**

**అప్రమత్తతతో ప్రాణాపాయం నుంచి బయటపడిన నలుగురు ప్రయాణికులు**

**ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది**

ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 14: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ ఫ్లైఓవ్ప బుధవారం ఓ కారు అగ్నిప్రమాదానికి గురైంది. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న రెనాల్ట్ డస్టర్ పెట్రోల్ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తీవ్ర కలకలం రేగింది. ఫ్లైఓవ్ప కారు మంటల్లో చిక్కుకోవడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు ఆందోళనకు గురయ్యారు.

వరంగల్ జిల్లా గీసుకొండ మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు ఖీఖీ09ఢ్ఖ2557 నంబరు గల కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నట్లు సమాచారం. అన్నోజిగూడ ఫ్లైఓవ్పకి చేరుకోగానే కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన ప్రయాణికులు వెంటనే అప్రమత్తమై కారు నుంచి సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది.

కారులో మంటలు క్రమంగా వ్యాపించడంతో వాహనం అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో ఫ్లైఓవ్ప కొద్దిసేపు ఆందోళనకర వాతావరణం నెలకొంది.

**పెను ప్రమాదం తప్పింది!**

ప్రమాద సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తున్నప్పటికీ అందరూ సురక్షితంగా బయటపడటంతో ప్రాణనష్టం తప్పింది. కారులో మంటలు చెలరేగడానికి సాంకేతిక లోపమా, ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే విషయం తెలియాల్సి ఉంది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై స్పష్టత రావాల్సి ఉండగా, ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు అందాల్సి ఉంది.

# 11 ఫ్లాట్లు... 2, 200 గజాలు హాంఫట్

**నెత్తి నోరు బాదుకుంటున్న బాధితులు**

**రూపాయి రూపాయి జమచేసి కొనుక్కున్న ఫ్లాట్లు కబ్జా**

**సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి**




మేడ్చల్, అక్టోబర్ 14: ( మనం జిల్లా ప్రతినిధి ): 11 ఫ్లాట్లు.. ఒక ఫ్లాట్ కు 2 వేల 200 గజాలు... ఇలా 11 ఫ్లాట్లకు 2 వేల 200 గజాల స్థలం కబ్జాకు గురైంది. రూపాయి రూపాయి జమ చేసుకొని కొనుక్కున్న ఫ్లాట్లను కబ్జా చేయడమే కాకుండా 11 ఫ్లాట్ల యజమానులపై కోర్టులో

కేసు వేసిన ఘనుడి ఘనత ఇది. ఈ వ్యవహారం కోర్టులో కేసు నడుస్తుండగా సదరు కబ్జాదారుడు 11 ఫ్లాట్ల కాని లను తొలగించి మట్టి పోసి చెదను చేసి కబ్జాకు పాల్పడ్డాడని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.

**బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.**

మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ 252 సర్వే నెంబర్ లో అకౌంట్స్ జనరల్ ఆఫీస్ ఎంప్లాయిస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఇక్కడ స్థలాన్ని కొనుగోలు చేసింది. సొసైటీ ద్వారా 11 మంది ఉద్యోగులు 11 ఫ్లాట్లను కొనుగోలు చేశారు. 2010లో వారి వారి పేర్ల మీద ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే 2014లో అదే సొసైటీకి చెందిన వ్యక్తి ఈ 11 ఫ్లాట్లు మావే అంటూ 11 మంది మీద కోర్టులో కేసు వేశారు. ఈ కేసు ప్రస్తుతం నడుస్తుండగా ఇటీవల సదర్ వ్యక్తి 11 ఫ్లాట్ల హద్దులను తొలగించి మట్టితో చెదను చేశారు. ఈ ప్రాపర్టీ మాదే అంటూ బోర్డును సైతం ఏర్పాటు చేసుకున్నాడు. అయితే విషయం తెలుసుకున్న బాధితులు

**సంఘటన స్థలానికి చేరుకొని**

మాకు న్యాయం చేయాలి అంటూ సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. ఇదే కాకుండా ఆ స్థలంలో ఉన్న రోడ్డును, డ్రైనేజీని సైతం వదలకుండా మట్టి పోసి కబ్జాకు పాలు పడ్డట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

**సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలి**

ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. రూపాయి రూపాయి జమ చేసుకొని

ఫ్లాట్లను కొనుగోలు చేస్తే దొంగ చాటున కబ్జాకు పాల్పడి నోట్లో మట్టి కొట్టాడని ఘాటుగా విమర్శించారు. ఉద్యోగ విరమణ తర్వాత ఈ ఫ్లాట్లు దేనికైనా పనికొస్తాయి అన్న ఉద్దేశంతో కొనుగోలు చేస్తే వాటిని కబ్జాకు పాల్పడడం అన్యాయమని ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు మేడ్చల్ టౌన్ ప్లానింగ్ అధికారులను, రెవెన్యూ అధికారులను, ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు.



# దసరా వేడుకలు ప్రజలందరిలో ఆనందం నింపాలి: పద్మారావు గౌడ్

**చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు..**

**సొంత ఖర్చుతో భక్తులకు అన్నప్రసాద పంపిణీ..**

సికింద్రాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ ఆకాంక్షించారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం చిలకలగూడలోని చారిత్రాత్మక కట్ట మైసమ్మ దేవాలయాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దసరా పండుగకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని, ప్రజలంతా





భక్తిశ్రద్ధలతో, సంతోషంగా పండుగను జరుపుకోవాలని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరిధిలో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు సంబంధిత విభాగాలన్నీ పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పండుగల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలని అన్నారు. అనంతరం తన సొంత ఖర్చుతో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు తీగుళ్ల కిషోర్ కుమార్, రామేశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, కార్యనిర్వహణాధికారి మహేందర్ గౌడ్, పద్మారావు గౌడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## కేటీఆర్ ను కలవడానికి తరలి వెళ్లిన గుండ్ల పోచంపల్లి బిఆర్ఎస్ నేతలు

మేడ్చల్, అక్టోబర్ 14: ( మనం జిల్లా ప్రతినిధి ): రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ సింగరేణి కార్మికుల సభా కు కరీంనగర్ కు వెళ్లిన సందర్భంగా ఆయనను కలిసేందుకు గుండ్ల పోచంపల్లి బిఆర్ఎస్ నేతలు భారీ ఎత్తున తరలి వెళ్లారు. శామీర్ పేట్ కట్టా మైసమ్మ గుడి దగ్గర కేటీఆర్ ను కలిసేందుకు గుండ్ల పోచంపల్లి డివిజన్ నుండి రాష్ట్ర నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి అధ్యర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మద్దుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సభకు వెళుతున్న కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసేందుకు తరలి వెళ్లామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం లో మేడ్చల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, బేరి బాలరాజ్, ఆమరం హేమంత్ రెడ్డి, చింత పెంటయ్యా, మరియు టిఆర్ఎస్ పార్టీ నాయకులు బండారి రాజు, ఓర్సు శ్రీహరి , కే ప్రతాప్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మహేష్, చింత బాబు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ రంగ కార్మికుల నిర్వహణకు యాప్ ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) : నిర్మాణ రంగ కార్మికుల నిర్వహణ కోసం రూపొందించిన ఏఐ ఆధారిత క్యాప్టెక్ ఇ-ఫోర్స్ యాప్ను క్యాప్టెక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ పునః ప్రారంభించినట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ అశుతోష్ కత్యాల్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. భారత దేశంలో రూపొందించిన ఈ యాప్ ద్వారా కార్మికుల నియామకం, వర్క్ ఆర్డర్లు, రోజువారీ పురోగతి నివేదికలు, బిల్లుల ట్రాకింగ్, చెల్లింపులను సులభంగా నిర్వహించవచ్చని తెలిపారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా 30కి పైగా ప్రాజెక్టుల్లో 5 వేల మందికి పైగా లేబర్ కాంట్రాక్టర్లతో ఈ ప్లాట్ఫామ్ పనిచేస్తోందని తెలిపారు. సుమారు 5 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా రూపొందించిన ఈ యాప్ కంపెనీల ఈఆర్పీ వ్యవస్థలతో అనుసంధానం అవుతుందని తెలిపారు. ఇంగ్లీష్, హిందీ, మరాఠీ, బంగ్లా భాషల్లో అందుబాటులో ఉందని తెలిపారు.

# మున్నూరు కాపు భవన్‌లో బతుకమ్మ సంబరాలు





హైదరాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) : కాచిగూడ లోని మున్నూరు కాపు భవన్ లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. మున్నూరు కాపు రాష్ట్ర మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చామకూర సుజాత , ప్రధాన కార్యదర్శి నందిగామ అన్నపూర్ణ ల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి పలువురు అధిక సంఖ్యలో హాజరై సందడి చేశారు. మున్నూరు కాపు రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్క ృతి , సాంప్రదాయాలను పరిరక్షించడం అవసరమన్నారు. భవిష్యత్ తరాలకు మన సంస్క ృతి గొప్పతనాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు రాష్ట్ర మహాసభ ప్రధాన కార్యదర్శి గండు సతీష్ కుమార్ , మహేష్ ,గుండం రమేష్ , కావేటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ: ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

**ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు..**



సికింద్రాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మెయిన్ బిల్డింగ్ లో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ మంగు అధ్యాపకులు, విద్యార్థినులు, మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది సమష్టిగా ఈ పండుగను ఉత్సాహంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. భావితరాలకు బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. యువతకు పండుగ గొప్పతనాన్ని వివరించడం ద్వారా భవిష్యత్తు తరాల్లోనూ సంప్రదాయాలను కొనసాగించవచ్చన్నారు. పూలు, ఆకులతో ప్రకృతికి హాని కలగకుండా జరుపుకునే ఈ పండుగ విశిష్టతను దేశంలోని ఇతర రాష్ట్రాలకు సైతం చాటిచెప్పాలని ఆకాంక్షించారు.